సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



వినతులపై తక్షణమే స్పందించాలి

ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే వినతులపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. - 8లో



వెయిట్ లిఫ్టింగ్‌లో 'అజేయుడు'

వెయిట్ లిఫ్టింగ్‌లో కొండవెలగాడ కుర్రాడు రాణిస్తున్నాడు. స్కాట్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. - 8లో

ఆర్ఎస్‌కేలలో యూరియా

పార్వతీపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా దాదాపు 777 టన్నుల యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరో వారం రోజుల్లో 400 టన్నుల యూరియా జిల్లాకు వస్తుందన్నారు. ప్రస్తుతం 1451 టన్నుల డీఏపీ, 1440 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 611 టన్నుల పొటాష్, 901 టన్నుల పాస్ఫేట్ అందుబాటులో ఉందన్నారు.

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



మత పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పార్వతీపురం: ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ, ఆధ్యాత్మిక చింతనతో పండగలు జరుపుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మత సామరస్యంపై మతపెద్దలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో వారివారి ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ పండగలు జరుపుకోవాలన్నారు. గణేష్ చతుర్థి, దసరా, క్రిస్మస్, రంజాన్, గ్రామదేవతల ఉత్సవాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలు, అశ్లీల నృత్యాలు నిషేధమన్నారు. గణేష్ నిమజ్జనాలు ఈనెల 9వ తేదీలోగా పూర్తి కావాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నదులు, గెడ్డలు, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉందని, నదుల్లోకి ఎవరూ దిగరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, వివిధ మతాల పెద్దలు, తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు సభ్యుల పర్యటన



గుమడ గ్రామ పరిసరాల్లో ఏనుగుల సంచారంపై ఆరా తీస్తున్న అధికారులు


కొమరాడ: మండలంలోని గుమడ గ్రామ సమీపంలో సంచరిస్తున్న తొమ్మిది ఏనుగుల గుంపును నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు సభ్యుడు ప్రొఫెసర్ సుకుమార్ సోమవారం పరిశీలించారు. ఏనుగుల సంచారంపై జిల్లా అటవీశాఖ అధికారి జీఏపీ ప్రసూనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి



సబ్‌కలెక్టర్ వైశాలికి మాత్రలు అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో రక్తహీనతను పూర్తిగా నివారించేందుకు వైద్య సిబ్బంది సూచించిన ఆరోగ్య జాగ్రత్తలను మహిళలు పాటించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఎనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభించారు. అధికారులకు మాత్రలను అందజేశారు. 20 ఏళ్ల నుంచి 49 ఏళ్లలోపు గల మహిళలు వారానికి ఒక మాత్రను విధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, ఆర్డీఓ కె.హేమలత పాల్గొన్నారు.



వినాయకునికి 108 రకాల వంటకాలతో నైవేద్యం

కురుపాం మండల కేంద్రంలోని కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు వరసిద్ధి వినాయకునికి సోమవారం 108 రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. - కురుపాం

కాకి లెక్కలు..!

- అంకెల్లోనే పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారం
- నెలల తరబడి తిరుగుతున్నా సమస్యలకు కలగని మోక్షం
- పదేపదే అవే విజ్ఞప్తులు
- అన్నీ పరిష్కరించేసినట్లు చెబుతున్న అధికారులు

చేద్దాం.. చూద్దాం

ఈయన పేరు ఇంట్రంజి సింహాచలం. 2020–21 ఆర్థిక సంవత్సరంలో సీతంపేట మండలంలోని ఐటీడీఏ క్వార్టర్స్‌లో 80 మీటర్ల సీసీ రోడ్డు వేశారు. దాని బిల్లులు నేటికీ జమ కాలేదు. అప్పటి నుంచి ఇప్పటికి ముగ్గురు ఏఈలు మారారు. వారి వద్దకు వెళ్లి బిల్లుల కోసం అడిగితే.. చేద్దాం, చూద్దామన్న సమాధానమే వస్తోంది. త్వరితగతిన బిల్లులు మంజూరు చేసేలా చూడాలని ఈ ఏడాది మార్చి



24న, జూన్ 16న సీతంపేట ఐటీడీఏ పీవోకు.. జులై 14న కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు అందజేశారు. తాజాగా ఈ సోమవారం మరోసారి పీజీఆర్ఎస్‌కు వచ్చి అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఈమె పేరు పువ్వల శోభ. కొమరాడ మండలం. కొన్నాళ్ల కిందట ఆమె భర్త చనిపోయారు. వితంతు పింఛన్ కోసం కొద్ది నెలలుగా ఆమె దరఖాస్తు చేసుకుంటోంది. మండలంలో అధికారుల చుట్టూ తిరిగింది. ఇప్పటికే రెండు దఫాలు పీజీఆర్ఎస్‌లోనూ వినతిపత్రం అందించింది. నేటికీ పింఛన్ మంజూరు కాలేదు. ఒంటరి మహిళనైన తనకు పింఛను ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటోంది.

సాక్షి, పార్వతీపురం మన్యం:

పేరుకే.. ప్రజాసమస్యల పరిష్కార వేదిక! ఒక్కటైనా పరిష్కారానికి నోచుకున్న దాఖలాలు లేవు. పదేపదే తిరిగి అర్జీదారులు విసిగిపోవాలే గానీ.. అధికారులకు పీజీఆర్ఎస్ వినతులంటే చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. ఈ మాటలంటున్నవి స్వయంగా ప్రజలు, ప్రజాసంఘాల నాయకులే. ఏడాది కిందట ఇచ్చిన వినతులకు నేటికీ మోక్షం కలగడం లేదు. పింఛన్లు, భూసమస్యలు, రెవెన్యూపరమైన అంశాలు, ప్రభుత్వ పథకాలు, సామాజిక, వ్యక్తిగత సమస్యలు.. ఇలా ఏదైనా సరే విజ్ఞప్తులు బుట్టదాఖలు కావాల్సిందే అంటూ వాపోతున్నారు.

విజ్ఞప్తులు వేలల్లో.. పరిష్కారం?

ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని ఉన్నతాధికారులు చెబుతున్న మాటలు.. ఆచరణలో నీరుగారిపోతున్నాయి. ఏదైనా సమస్యను పరిష్కరించలేని యెడల సహేతుకమైన కారణాన్ని, దరఖాస్తుదారులకు అర్థమయ్యేరీతిలో వివరించాలని కలెక్టర్‌తోపాటు, ఇతర ఉన్నతాధికారులు చెబుతున్నారు. కిందిస్థాయిలో ఒక అంశంపై పదేపదే తిరిగినా న్యాయం జరగకపోవడంతోనే అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తుంటారు. ఇక్కడ వారి సమస్యను వింటున్న అధికారులు.. మరలా జిల్లా అధికారులు, మండలాలకే పంపుతున్నారు. వారేమో, అసలు పరిశీలించకుండానే పరిష్కరించేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేస్తున్నారు. అంకెల్లో అంతా బాగున్నట్లే అని చూపించేస్తున్నారు. తమ విజ్ఞప్తి ఏమైందో తెలియక.. ప్రజలు నమ్మకంతో మళ్లీమళ్లీ వచ్చి వినతిపత్రాలు అందిస్తున్నారు. పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారంపై గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరగా, అధికారులు ఇచ్చిన అంకెలు.. కాకి లెక్కలను తలపించడం విశేషం. ఈ ఏడాది ఆగస్టు 4వ తేదీ నాటికి జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 44,919 వినతులు అందాయి. అందులో 44,384 వినతులను పరిష్కరించేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా 535 వినతులు పెండింగులో ఉన్నట్లు చూపుతున్నారు. తామే అనేక సమస్యలపై ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించామని.. అందులో ఒక్కటీ పరిష్కారం కాలేదని.. చిత్తశుద్ధిలేని కార్యక్రమాన్ని నిర్వహించడం ఎందుకని గిరిజన సంఘ నేత రంజిత్‌కుమార్‌తో పాటు, పలు ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

రసీదులు 'కట్ట'కట్టుకోవాల్సిందే!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో గిరిజన, భూ సమస్యలపై అనేక వినతిపత్రాలిచ్చామని ప్రజాసంఘాల నాయకులు అంటున్నారు. ఒక్కటీ పరిష్కారం కాలేదని సీపీఎం నేత రాము చెబుతున్నారు. తాను ఒక్కడినే 40 వరకు వినతిపత్రాలందించానని.. అందులో దేనికీ మోక్షం కలగలేదని చెప్పారు. ఏదో న్యాయం జరుగుతుందన్న ఆశతో



గిరిజనులు వస్తున్నారని.. ఎన్నిసార్లు అర్జీ పెట్టుకున్నా ఫలితం ఉండటం లేదని తెలిపారు.



తీర్మానానికే స్పందన శూన్యం

వీరంతా గుమ్మలక్ష్మీపురం మండలం రాయఘడ జమ్ము పంచాయతీకి చెందిన మహిళలు. పెంగువ గ్రామంలో ఉన్న డీఆర్ డిపోను ఇప్పటి వరకు సరస్వతీ మహిళా సంఘం వారు నడుపుతున్నారని.. వారి కాల పరిమితి అయిపోవడంతో పీసా గ్రామ సభ నిర్వహించి, ఇకపై సీతాదేవి మహిళా సంఘానికి అప్పగించాలని సభ్యులంతా తీర్మానించుకున్నారు. ఆ మేరకు అధికారులను కలిసి తమ తీర్మాన ప్రతులను అందజేశారు. ఫలితం లేదు.. గతంలో ఓ సారి కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం అందించారు. స్పందన లేకపోవడంతో మరోసారి పీజీఆర్ఎస్‌లో విజ్ఞప్తి చేశారు.

రోడ్డు వేయాలని ఐదుసార్లు వచ్చారు..



వీరు గుమ్మలక్ష్మీపురం మండలం వల్లాడ, బయ్యాడ గ్రామస్తులు. గొరడ ఆర్అండ్‌బీ రహదా రి నుంచి తమ ప్రాంతానికి రహదారి సౌకర్యం కల్పించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇప్పటికి ఐదు దఫాలుగా పీజీఆర్ఎస్‌కు వచ్చి వినతిపత్రం అందజేశారు. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల అత్యవసర సమయంలో గర్భిణులు, రోగులను ఆసుపత్రికి తరలించేందుకు చాలా ప్రయాసలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోతున్నాయని వాపోతున్నారు. సరకులు తీసుకుని వెళ్దామన్నా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మరోసారి అధికారులను కలిసి తమ సమస్య చెప్పుకొన్నారు. రావడమే మిగులుతుంది గానీ.. సమస్య పరిష్కారం కావడం లేదని వారు వాపోయారు.



సంవత్సరాలు గడుస్తున్నా వైఎస్సార్ చేసిన మంచి పనులు ప్రతి ఒక్కరి మదిలో నిలిచే ఉన్నాయి. రైతుల రుణాల మాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, సాగునీటి సదుపాయాల కల్పనతో రైతన్నల గుండెల్లో గుడికట్టుకున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువుకు ఊతమిచ్చి విద్యార్థుల మనసుగెలుచుకున్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలతో ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించి ఆరోగ్యప్రదాతగా పేరుగాంచారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు పల్లె, పట్టణ ప్రజలు సిద్ధమవుతున్నారు.

రాజన్నా.. నీ మేలు మరువలేము...

- రైతు బాంధవుడు వైఎస్సార్
- రుణమాఫీ చేసి రైతుల ఊపిరి నిలిపిన మహనీయుడు
- ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలతో వైద్య భరోసా కల్పించిన ఆరోగ్యప్రదాత
- ఉచిత విద్యుత్‌తో రైతన్నకు సాగు అండ
- నేడు వైఎస్సార్ వర్ధంతి

విజయనగరం ఫోర్ట్/కొమరాడ:

తీవ్ర కరువు పరిస్థితులు.. ఎటుచూసినా దుర్భిక్షమే.. తినడానికి తిండలేక రైతులు వలస పట్టే రోజులు.. వరుస కరువులతో రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయిన వైనం.. చాలా మంది రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడిన దుస్థితి.. ఇటువంటి పరిస్థితులను చూసిన చలించిన నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల రుణాలు మాఫీ చేసి రైతుబాంధవుడిగా పేరుకెక్కారు. రుణాలు చెల్లించిన వారికి ప్రోత్సాహకం అందించారు. అందుకే వైఎస్సార్ పాలన తమకు స్వర్ణయుగం వంటిదన్నది రైతుల మాట.

● ఉచిత విద్యుత్‌తో సాగు భరోసా..



వరుస కరువుల వల్ల 2004కు ముందు రైతులు కష్టాలతో కొట్టుమిట్టాడే రోజులు అవి. భూములు సాగుకు నోచుకోక పోవడంతో బీడు భూములుగా మారాయి. మరోవైపు విద్యుత్ చార్జీల భారం. రైతులు వ్యవసాయం చేయడానికి వెనుకాడే పరిస్థితి. ఆ సమయంలో అధికారం చేపట్టిన వైఎస్సార్ రైతుల రుణాలుమాఫీ చేయడంతో పాటు బోర్ల ద్వారా పంటలను సాగు చేసుకోవడం కోసం ఉచిత విద్యుత్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. అప్పటి ప్రతిప్రక్ష తెలుగుదేశం పార్టీ వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇస్తానంటే హేళన చేశారు. కాని రైతు సంక్షేమం కోసం తాను ఎంత ఖర్చు అయినా చేస్తానని ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి ప్రతిపక్ష పార్టీ నాయకులకు మాట ఆడలేని పరిస్థితిని కల్పించారు. ఇప్పటికీ ఆ పథకం కొనసాగుతుండడం ఆయన చలువే అని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.


● ఆదుకున్న అత్యవసర సేవలు..



108 వాహన సేవలు రాక ముందు ఆపద సమయాన సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేక ఎంతో మంది మృత్యువాత పడేవారు. 108 వచ్చిన తర్వాత ఫోన్ చేసిన 15 నిముషాల్లో కుయ్‌కుయ్‌మంటూ క్షణాల్లో సంఘటనా స్థలానికి వాహనం చేరుకుని ఆస్పత్రికి చేర్చడం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలిచాయి. 104 సేవలతో పల్లె చెంతకే వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్సార్‌దే. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎలాంటి వ్యయప్రయాసలకు గురికాకుండా నెలనెలా వైద్యపరీక్షలతో పాటు అవసరమైన మందులు అందజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టినది ఆయనే.



● విజయనగరం విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను అందించాలనే ఉద్దేశంతో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకువేసి కళాశాలను యూనివర్సిటీగా స్థాయి పెంచారు. విద్యార్థుల ఇంజినీరింగ్ కలను నెరవేర్చే విద్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చారు.



● కొమరాడ మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామం వద్ద 1976లో చేపట్టిన జంఝావతి రిజర్వాయర్ నిర్మాణం ఒడిశా వివాదంతో నిలిచిపోయింది. వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక ఆస్ట్రియా దేశ టెక్నాలజీతో రూ.6కోట్లు ఖర్చు చేసి రబ్బర్‌డ్యాం నిర్మించి 12 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. ఆ ప్రాంత రైతుల గుండెల్లో గుడికట్టుకున్నారు. తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తిచేయడంలోనూ ఆయన కృషి ఎనలేనిదని ఇప్పటికీ ఈ ప్రాంతరైతులు చెబుతారు.

వైఎస్సార్ రుణం తీర్చుకోలేనిది

నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. కరువు పరిస్థితుల వల్ల బ్యాంకులో తీసుకున్న రూ.50వేలు రుణం తీర్చలేకపోయాను.వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అసలు రూ.50 వేలు, వడ్డీ రూ.30 వేలు మొత్తం రూ.80 వేలు రుణమాఫీ చేశారు. మళ్లీ బ్యాంకులో రుణం కూడా ఇప్పించారు. వైఎస్సార్ దయ వల్ల అప్పునుంచి విముక్తిపొందాను. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

– ఎస్.సర్వదేముడు, రైతు

ఆరోగ్యశ్రీ బతికించింది

ఆయాసం వస్తుందని విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపిస్తే గుండె ఆపరేషన్ చేయాలని చెప్పారు. నా దగ్గర చిల్లి గవ్వలేదు. ఆరోగ్యశ్రీ కార్డు చూపిస్తే ఒక్క పైసా ఖర్చు లేకుండా నాకు గుండె ఆపరేషన్ చేశారు. నేను ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను.

– సియ్యాద్రి సూర్యనారాయణ, విజయనగరం



● ప్రజల ఆరోగ్యానికి అండగా..

ఆరోగ్యశ్రీ రాకముందు ఏదైనా జబ్బు చేస్తే పేదోడు భూమిగాని, ఇల్లుగాని తాకట్టు పెట్టుకుని వైద్యం చేయించుకునే పరిస్థితి ఉండేది. వైద్యం చేయించుకోలేని వారు మంచాన పడి మృత్యువాత పడాల్సిందే. ఇటువంటి పరిస్థితిని చూసి చలించిన వైఎస్సార్ పేదవాడికి ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని ఆస్పత్రికి వెళితే చాలు పిలిచి మరీ వైద్యం చేసేవారు. ఆరోగ్యశ్రీ వచ్చిన తర్వాత ప్రాణపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది పునర్జన్మ పొందారు.

కనికరించండి సారూ..

సాక్షి, పార్వతీపురం మన్యం: ఆ కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. అన్యోన్యంగా ఉన్న బాంధవ్యాలను చిన్నాభిన్నం చేసింది. వృద్ధాప్యంలో తనకు తోడు ఉంటారనుకున్న కుమారుడు, కోడలు.. కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయారు. ముక్కుపచ్చలారని చిన్నారులకు ఇప్పుడు తానే అంతా! ఏ ఆధారమూ లేని తనకు.. మరో ఇద్దరి బిడ్డల భారం! అధికారుల సాయం కోసం తిరుగుతోంది. మక్కువ మండలం మార్కొండపుట్టి పంచాయతీ కోదు పెద్దవలస గ్రామానికి చెందిన మండంగి లచ్చమమ్మ కుమారుడు శంబర పీహెచ్‌సీలో పని చేసేవాడు. అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మరణించాడు. ఆయనకు ఉద్యోగం ఉండటం వల్ల ఆ కుటుంబానికి రేషన్ కార్డు, వారి ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం రాలేదు. తమ దీనస్థితిని వివరిస్తూ.. న్యాయం చేయాలని పిల్లల తల్లి అధికారుల చుట్టూ తిరిగింది. చివరికి ఆమె కూడా అనారోగ్యంతో ఇటీవలే మరణించింది. తల్లిదండ్రులు ఇద్దరూ కొద్ది రోజుల వ్యవధిలోనే మృతి చెందడంతో ఆ పిల్లలు దిక్కు లేనివారయ్యారు.



తల్లిదండ్రులకు కోల్పోయిన పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చిన లచ్చమమ్మ

కూలి పనులు చేసుకుని బతికే నాయనమ్మే అన్నీ అయ్యింది. తండ్రి రేషన్ కార్డులో వీరి పేర్లు ఉండిపోవడంతో ఏ ప్రభుత్వ పథకానికీ నోచుకోవడం లేదు. కనీసం బిడ్డల చదువుకు ఉపయోగపడేలా తల్లికి వందనం పథకం అయినా ఇవ్వాలని.. తనకు ఆధారం చూపాలని నాయనమ్మ లచ్చమమ్మ కోరుతోంది. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చి, అధికారులకు తన దీన స్థితిని వివరించింది. కష్టమైనా వారి పరిస్థితి చూసి కొంత కనికరం చూపుతుందేమో.. మరి మన అధికారులు ఏం చేస్తారో చూడాలి.

శేఖర్ అవయవాలు సజీవం



శేఖర్ మృతదేహం ముందు బైక్‌పై ర్యాలీ



రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శేఖర్‌కు అంతిమ వీడ్కోలు

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం గదంవలస గ్రామానికి చెందిన చిలకల శేఖర్ ఇటీవల ఎచ్చెర్ల వద్ద రోడ్డు ప్రమాదానికి గురై శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు. ఆయనకు బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు గుర్తించడంతో కుటుంబ సభ్యులు అంత బాధలోనూ అవయవదానానికి అంగీకరించారు. దీంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో అవయవదాన ప్రక్రియను సోమవారం పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న గదంవలస గ్రామస్తులు శ్రీకాకుళం–పాలకొండ రోడ్డు మీదుగా ర్యాలీ చేస్తూ అంతిమయాత్ర నిర్వహించారు. –సీతంపేట/బూర్జ

కూటమి తీరుపై నిరసన హోరు



ఎరువులు సక్రమంగా సరఫరా చేయాలంటూ కలెక్టరేట్ వద్ద పూడేసు గ్రామస్తుల నిరసన



ఇంటి బిల్లుల బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ వద్ద సీతంపేట మండలం మర్రిపాడు గ్రామస్తుల ఆందోళన

కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వివిధ వర్గాల ప్రజలు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళనలు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. పీజీఆర్ఎస్‌లో వినతులు అందజేశారు. రైతు సేవా కేంద్రానికి వచ్చిన 120 బస్తాల యూరియాలో ఒక్క బస్తాకూడా రైతులకు పంపిణీ చేయలేదంటూ కొమరాడ మండలం పూడేసు రైతులు ఆందోళన చేయగా, ఇంటి బిల్లులు చెల్లించాలంటూ సీతంపేట మండలం మర్రిపాడు గ్రామస్తులు డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల వేళ అరకు సభలో ఏజెన్సీ ప్రాంతాల్లో వందకు వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇస్తామని హామీ ఇచ్చి మెగా డీఎస్సీతో అన్యాయం చేశారంటూ ఆదివాసీ గిరిజన, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరుద్యోగులు నిరసన తెలిపారు. ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. – పార్వతీపురం రూరల్

క్లుప్తంగా

కామర్స్ అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపక పోస్టును భర్తీ చేయడానికి గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ అర్హత కలిగి ఉండాలని, నెట్,సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల10న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి భజన పోటీలు రేపు

పాలకొండ: పట్టణంలోని ఏలాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయ మంటపం వద్ద బుధవారం జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలుపొందిన భజన బృందాలకు మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.4 వేలు అందిస్తామని వివరించారు. అలాగే బెస్ట్ సింగర్, బెస్ట్ డోలక్, బెస్ట్ హార్మోనిస్టులను ఎంపిక చేసి బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న భజన బృందాలు నేరుగా తమ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొన్న ఆటో


తీవ్ర గాయాలపాలైన ఆటోడ్రైవర్

బొండపల్లి: మండలంలోని చందక పేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26పై ఆగి ఉన్న లారీని వేగంగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం వేకువ జామున జరి గిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలి లా ఉన్నాయి. విజయనగరం నుంచి గజపతినగరం వైపు మిరపకాయలు లోడుతో వెళ్తున్న ఆటో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టడంతో శ్రీకాకుళానికి చెందిన డ్రైవర్ చంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్‌ను జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై ఎస్సై నవీన్‌పడాల్ నేతృత్వంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.18,860 నగదు, రెండు జతల పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జిల్లా కేంద్రంలో గంజాయి కలకలం

• 24కేజీల గంజాయితో ఏడుగురి అరెస్ట్


నిందితుల వివరాలు సేకరిస్తున్న పట్టణ పోలీసులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం ఒడిశా, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన ముఠా నుంచి ఓ ప్రైవేట్ లాడ్జిలో 24కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై గోవింద తెలిపారు. ఒడిశాకు చెందిన రామ్ ఖిల, రమేష్ కోరా, సంతోష్, ప్రశాంత్‌లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆకాష్, వినయ్, ప్రతాప్‌లకు లాడ్జి వద్ద గంజాయిని అందజేస్తున్న క్రమంలో ఒక సూట్‌కేస్, మరో బ్యాగ్‌లో అప్పజెప్పేందుకు ఉంచిన గంజాయితో పాటు వారిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఏడుగురు వ్యక్తులతో పాటు వారు ఉపయోగించిన కారును, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

స్వమిత్వ గ్రామాలను సందర్శించాలి

పార్వతీపురం రూరల్: జిల్లాలో స్వమిత్వ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాలను సంబంధిత మండల అధికారులు మంగళవారం సందర్శించి స్వయంగా ఆయా పనుల ప్రగతి నివేదికను తనకు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ నిరుద్యోగులుగా మిగిలిన యువతకు వారికి నచ్చిన రంగాల్లో శిక్షణ కార్యక్రమం చేపట్టి ఉపాధిఅవకాశాలు కల్పించేలా కౌశలం పేరుతో డేటా రూపొందించామన్నారు. ఈ డేటా ఆదారంగా ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీలు తనిఖీ చేసి కచ్చితమైన డేటాను స్పష్టం చేయాలని సూచించారు. అలాగే ఈపీటీఎస్ కింద ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను జీఓలు, సర్క్యులర్‌లు, ఇతర ఉత్తర్వులు స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అలాగే జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత, కృత్రిమ కొరత లేకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.హేమలత, ఎస్‌డీసీలు పి.ధర్మ చంద్రారెడ్డి, ఎస్. దిలీప్‌చక్రవర్తి, డీపీఓ కొండలరావు, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వట్టి గెడ్డలో రైతు గల్లంతు?

సాలూరు రూరల్: మండలంలోని దుద్దిసాగరం గ్రామానికి చెందిన మంచాల రామయ్య (45) సోమవారం వట్టి గెడ్డలో గల్లంతయ్యాడు. వట్టి గెడ్డ దాటి ఉన్న తన పొలం పనులకు రామయ్య సోమవారం ఉదయం వెళ్లి తిరిగి సాయంత్రం 5.30గంటల సమయంలో వస్తుండగా వట్టి గెడ్డలో దిగి వస్తుండగా గల్లంతయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు.అయితే వట్టిగెడ్డ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కొట్టుకుపోయాడని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

వినతులపై తక్షణమే స్పందించాలి

• కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యలకు సంబంధించిన వినతులపై తక్షణమే సంబంధిత అధికారులు స్పందించాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు సబ్‌కలెక్టర్ ఆర్.శాలి, డీఆర్‌ఓ హేమలత, ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణిలు అర్జీదారుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించిన కలెక్టర్ వారు తెలిపిన ప్రతి సమస్యను సావధానంగా విని తగిన పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు.

వచ్చిన వినతుల్లో కొన్ని..

సీతంపేట మండలం పాడిదుమ్మ నుంచి దారబంద వరకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలి. కురుపాం మండలం పిరంగూడ నుంచి అడ్డాయిగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేయాలి. గుమ్మలక్ష్మీపురం మండలం గౌరడ నుంచి వల్లాడ వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలి. కురుపాం మండలం పట్టాయి గెడ్డలో అంగన్వాడీ బిల్డింగ్ నిర్మాణం పూర్తిచేయాలి. గతేడాదిలో ఎంపికైన డీలర్లకు నియామక పత్రాలు మంజూరు చేయాలని తదితర సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 73 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖాధికారులు కె.రాబర్ట్‌పాల్, వై.క్రాంతికుమార్, టి. కొండలరావు, డా.ఎస్.భాస్కరరావు, ఐసీడీసీ, డ్వామా పీడీలు టి. కనకదుర్గ, కె.రామచంద్రరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, సీపీఓ ఎస్ఎస్ఆర్‌కె పట్నాయిక్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్పీ ఆదేశాలు


సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి తన వద్దకు వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేందుకు సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ప్రధానంగా కుటుంబకలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ–ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలపై విచారణ చేసి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో 7 ఫిర్యాదులు అందాయి. డీసీఆర్బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 55 అర్జీలు


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ శాఖల సెక్టోరియల్ అధికారులు హాజరు కాకపోతే మెమోలు ఇవ్వాలని ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు సమయపాలన పాటించాలని, పీజీఆర్‌కు ఎవరెవరు వచ్చారో సంతకాలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.అందరూ బాధ్యతగా పనిచేసి వచ్చిన అర్జీలను తక్షణ పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 55 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చాయి. ఓంద్రుజోలలో జీపీఎస్ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతి ఇచ్చారు. తాగునీటి బోరు మంజూరు చేయాలని జరడగూడ గ్రామానికి చెందిన ఆరిక చిన్నారావు, తల్లికి వందనం డబ్బులు తమ పిల్లలు ఇద్దరికి రాలేదని పొలిష్‌కోటకు చెందిన బిడ్డిక బెన్నయ్య విన్నవించారు. భాషావలంటీర్‌ను నియమించాలని జన్నిగూడ గ్రామస్తులు కోరారు. ఆయిల్ ఇంజిన్ మంజూరు చేయాలని పోలవరానికి చెందిన ఊయక బోడమ్మ విన్నవించింది. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సత్యం, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు దారులకు కారణాలు తెలియజేయాలి

• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరంఫోర్ట్: ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే వినతులకు సంపూర్ణ న్యాయం చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా అర్జీలకు పరిష్కారం చూపించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 188 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తామని తెలిపారు. అసలైన ఫిర్యాదుదారులకు న్యాయం చేకూర్చేవిధంగా అధికారులు వ్యవహరించాలన్నారు. సమస్య పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలు అర్జీదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. వినతుల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి చూపాలని చెప్పారు. ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో అన్ని శాఖలు వారివారి ముఖ్యమైన శాఖ మెమోలు, ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలు వచ్చే గురువారంలోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో చర్యలు


ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ, ఏఎస్పీలు

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల నుంచి వినతులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్యలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 28 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుల సంచార ప్రాంత పరిశీలన

భామిని: మండలంలోని తాలాడ సమీప ఐలమ్మ తోటలో ఏనుగులు సంచరించిన ప్రాంతాలను విశాఖ ఫారెస్ట్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే, జిల్లా ఫారెస్ట్ ఆదికారి జీఏపీ ప్రసూనల బృందం సోమవారం పరిశీలించింది, ఐలమ్మ తోట పక్కనే గల వంశధార నది తీరాన్ని కూడా సందర్శించారు. గడిచిన మూడేళ్లుగా వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు ఎలా గడిపిందని మాత్రమే పరిశీలించారు. కూటమి నాయకులు చెబుతున్నట్లు గత మూడేళ్లుగా ఏనుగుల గుంపుతో రైతుల పడుతున్న ఇబ్బందులు తొలగించడానికి కాని, కుంకి ఏనుగులు తెచ్చి తరలించేందుకు చర్యలు తీసుకోవడం కోసం కానీ ఫారెస్టు అధికారులు చర్చించలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఏనుగుల బెడద లేకపోయినా వాతావరణం మారగానే తిరిగి వస్తాయని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఏనుగుల గుంపు ఎందుకు నివాసముంటోందనని ఆలస్యంగా ఆటవీ శాఖాదికారులు పరిశీలించడం ఆశ్చర్యం కలిగించింది. కన్జర్వేటర్ శాంతి ప్రియ పాండేకు ఎలిఫెంట్ రేంజర్ మణికంఠేశ్వరరావు ఏనుగుల జాడలు వివరించారు. పాలకొండ రేంజర్ రామారావు,కొత్తూరు సెక్షన్ అధికారులు దాలినాయుడు, రామకృష్ణ, కేశవ, ట్రాకర్స్ ఉన్నారు.


తాలాడ ఐలమ్మ తోట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కన్జర్వేటర్ శాంతి ప్రియ పాండే,డీఎఫ్‌ఓ ప్రసూన బృందం

ట్రాక్టర్ మీదపడి యువకుడి మృతి


పొడ్ల రాము(ఫైల్)

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో ట్రాక్టర్ మీదపడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెరుమాళి గ్రామానికి చెందిన పొడ్ల రాము(23) సోమవారం మధ్యాహ్నం ట్రాక్టర్‌ను కడిగేందుకు స్థానికంగా ఉన్న ఓ చెరువుకు తీసుకువెళ్లాడు. ట్రాక్టర్ కడగడం పూర్తవడంతో దాన్ని పైకి తెచ్చేందుకు డ్రైవింగ్ చేస్తుండగా ట్రాక్టర్ బురదలో కూరుకుపోయి ఇంజిన్ భాగం పైకి లేచిపోయింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడిపోతుందని గమనించిన డ్రైవర్ రాము వెంటనే కిందకు దూకేశాడు. దూకేసిన రాముపై ట్రాక్టర్ పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొన ఊపిరి ఉందన్న అనుమానంతో కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి ప్రమాదం జరిగిన వెంటనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై తెర్లాం ఎస్సై సాగర్‌బాబు వద్ద ప్రస్తావించగా దీనికి సంబంధించి ఇంతవరకు ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.

లారీ కింద పడి యువకుడు..


ఎర్రయ్య మృతదేహం

విజయనగరం క్రైమ్: నగరంలోని జేఎన్టీయూ జంక్షన్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వన్ టౌన్ సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధుపాడకు చెందిన ఎర్రయ్య (21) తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా జేఎన్టీయూ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఎర్రయ్య స్నేహితుడు ముందు పడిపోగా బైక్ నడుపుతున్న ఎర్రయ్య లారీ వెనక చక్రం వద్ద పడ్డాడు. ఆగి ఉన్న లారీ అప్పుడే బయలుదేరడంతో లారీ చక్రాలు ఎర్రయ్య మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సీఐ చౌదరి ఆదేశాలతో ఎస్సై లక్ష్మునాయుడు మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యాన్ ఢీకొని వృద్ధురాలు..


అన్నపూర్ణ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో ఇంటిబయట కుర్చీలో కూర్చుని సేదదీరుతున్న వృద్ధురాలిని వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్సై గణేష్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మజ్జి అన్నపూర్ణ(65) ఆదివారం రాత్రి పాన్ షాపు వద్ద కుర్చీలో కూర్చుని సేదదీరుతోంది. అదే సమయంలో నెల్లిమర్ల నుంచి వచ్చిన ఓ వ్యాన్ ఆ వృద్ధురాలిని బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వ్యాన్‌ను నిర్లక్ష్యంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతురాలి అల్లుడు గురునాయుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సకాలంలో స్పందించిన 108 సిబ్బంది

• తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని సీహెచ్‌సీకి తరలింపు

• తప్పిన ప్రాణాపాయం


విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన దత్తి వాసుకు 108 వాహనంలో ప్రథమ చికిత్స అందిస్తున్న టెక్నీషియన్ వెంకటరమణ

తెర్లాం: 108 వాహన సిబ్బంది సకాలంలో స్పందించి ఆస్పత్రికి తీసుకువెళ్లి ఓ వ్యక్తిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ దత్తి వాసు వ్యక్తి సోమవారం ఉదయం విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు తెర్లాం 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బోను వెంకటరమణ, పైలట్ పుప్పాల గౌరీశంకర్‌లు సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల కోసం రాజాం సీహెచ్‌సీకి తరలించారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తీసుకు రావడంతో ప్రాణాపాయ స్థితి తప్పిందని వైద్యులు 108 వాహన సిబ్బందిని మెచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌ను వ్యక్తిని కాపాడిన 108 వాహన టెక్నీషియన్, పైలట్‌ను కుటుంబ సభ్యులు, చుక్కవలస గ్రామస్తులు అభినందించారు.

ఉత్తమ పౌరసమాజనిర్మాణమే లక్ష్యం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

పార్వతీపురం: ఉత్తమ పౌర సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం కావాలని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలో జన విజ్ఞాన వేదిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల్లో పాఠశాలలు, వసతిగృహాలు, కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి విద్యార్థులను చైతన్య పరచాలని సూచించారు. కొన్ని గ్రామాలను దత్తతను తీసుకుని అన్ని విషయాల్లో..అన్ని రంగాల్లో శత శాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు పాలక రంజిత్ కుమార్, వంగల దాలినాయుడు, డి.చంద్రమౌళి, ఎం.వెంకటరమణ, కె.చిన్నారావు, యు.నాగార్జున, పి.సురేష్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అజేయుడు

• తండ్రి బాటలో రాణిస్తున్న తనయుడు

• కామన్‌వెల్త్ చాంపియన్ షిప్‌లో స్వర్ణం

• స్కాట్‌లాండ్‌లో జరగనున్న గేమ్స్‌కు ఎంపిక

• స్పోర్ట్స్ కోటాలో ఆర్మీలో ఉద్యోగం

• ప్రతిష్టాత్మక గేమ్స్‌లో స్వర్ణంపైనే గురి


2010 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బరువును ఎత్తుతున్న వల్లూరి శ్రీనివాసరావు


ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్ షిప్ పోటీల్లో బరువును ఎత్తుతున్న వల్లూరి అజయ్‌బాబు


బంగారు పతకంతో అజయ్‌బాబు

నెల్లిమర్ల రూరల్: వారిది నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణకు వ్యవసాయ పనులు చేస్తూ వచ్చిన కొద్దిపాటి కూలి డబ్బులతో సర్దుకుపోయే దుస్థితి. గ్రామీణ సంప్రదాయబద్ధ క్రీడల పట్ల ఆసక్తి ఆయనను అంచెలంచెలుగా ఎదిగేలా చేసింది. పెద్దగా చదువుకోకపోయినప్పటికీ నమ్ముకున్న క్రీడ ప్రస్తుతం ఉన్నత స్థాయిలో నిలబెట్టింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పదుల సంఖ్యలో పతకాలు సాధించి దేశ, రాష్ట్ర, జిల్లా కీర్తిని ఖండతరాల్లో ఇనుమడింపజేశారు. ఆయనే విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన సీనియర్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి శ్రీనివాసరావు. 1997లో శిక్షణ ప్రారంభించిన ఆయన పలు రాష్ట్రాల్లో జరిగిన చాంపియన్ షిప్ పోటీల్లో వరుస బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఇండియన్ ఆర్మీలో సిపాయి స్థాయి నుంచి జేఏఓ కేడర్ వరకు ఎదిగి ప్రస్తుతం రిటైర్ అయ్యారు. గ్రామంలోనే ఉంటూ మరికొంత మంది క్రీడాకారులను తయారు చేస్తున్నారు. వల్లూరి శ్రీనివాసరావు పెద్ద కుమారుడు అజయ్ బాబు తండ్రి సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని తన 8వ ఏట నుంచే వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ప్రారంభించాడు. 2021లో జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని యూత్ విభాగంలో తొలి స్వర్ణం సాధించాడు. 2022 జూలైలో ఉజెబికిస్తాన్, 2022 అక్టోబర్‌లో బహ్రెయిన్, 2023లో యూపీ(ఇండియా), 2024 డిసెంబర్‌లో ఖతర్, ఉజెబికిస్తాన్, అదే ఏడాది సెప్టెంబర్‌లో ఫిజ్జి దేశాల్లో వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో సత్తా చాటాడు. ప్రస్తుతం పాటియాలాలోని ఓ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రిని ఆదర్శంగా తీసుకున్న అజయ్‌బాబు వరుస విజయాలు సాధిస్తూ మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం

వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాణించేందుకు అజయ్ బాబు ప్రస్తుతం పాటియాలాలోని ఓ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణకు సంబంధించి అకాడమీ ఖర్చులు భరిస్తున్నప్పటికీ అదనంగా నెలకు రూ.40వేలు ఖర్చు అవుతున్నట్లు తండ్రి శ్రీనివాసరావు చెబుతున్నారు. గేమ్స్‌లో రాణించడమే తన కుమారుడి లక్ష్యమని లక్ష్య సాధనకు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న అజయ్ బాబు ఆ కోటాలో ఇటీవల ఇండియన్ ఆర్మీలో జేఏఓ కేడర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మరో నెల రోజుల్లో బాధ్యతలు కూడా స్వీకరించనున్నాడు.

స్కాట్‌లాండ్‌లో జరగనున్న పోటీలకు ఎంపిక

ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్ పోటీల్లో అజయ్‌బాబు స్వర్ణ పతకం సాధించడంతో 2026 జూలై 23 నుంచి స్కాట్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ గేమ్స్‌కు అర్హత సాధించాడు. ఆ పోటీల్లో తన కుమారుడు తప్పనిసరిగా స్వర్ణం సాధిస్తాడడని తండ్రి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹254

పికప్ వ్యాన్‌ను ఢీకొన్న ట్యాంకర్


ప్రమాద స్థలంలో మృతి చెందిన పికప్ వ్యాన్ డ్రైవరు

రాయగడ: పికప్ వ్యాన్‌ను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్‌తో సహా రెండు పశువులు మృతి చెందిన ఘటన జిల్లాలోని అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలో గల బొడొమంజారికుపా సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన పికప్ వ్యాన్ డ్రైవర్‌ను పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా ప్రశాంతిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన చందాక పవన్ కుమార్ (29)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. పశువుల లోడుతో పికప్ వ్యాన్ జిల్లాలోని అంబొదల నుంచి మునిగుడ వైపు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన డీజిల్ ట్యాంకర్ అదుపు తప్పి పికప్ వ్యాన్‌ను ఢీకొంది. ప్రమాదం అనంతరం ట్యాంకర్ డ్రైవర్, హెల్పర్లు పరారైనట్లు సమాచారం.

బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన తూతిక స్వామేశ్వరరావు(60)ఆదివారం అర్ధరాత్రి దిగువ వీధిలో ఉన్న మంచి నీటి బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధి కారణంగా బాధపడుతున్న సోమేశ్వర రావుకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ చేసినప్పటికీ నడుము నొప్పి ఎక్కువ ఉన్నందున బాధ తట్టులేక మానసికంగా కుంగిపోయి బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భర్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయనగరంలో యువకుడు..


గంగరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి కొండకరకాం గ్రామానికి చెందిన పి.గంగరాజు(20) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక అప్పులు చేసి, తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ ఎస్సై అశోక్ తెలిపారు. మృతుని అన్నయ్య సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.